ప్రజాశక్తి

బుధవారం 29 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కేశవరెడ్డి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

త్వరలో జిల్లాలో బాలోత్సవం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంకు కేశవరెడ్డి స్మారక సాహితీ అవార్డు ప్రదానం
- చిత్రలేఖన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

త్వరలోనే దాచూరిరామిరెడ్డి విజ్ఞాన కేంద్రం తరుపున ప్రకాశం జిల్లాలో బాలోత్సవం నిర్వహించనున్నట్లు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులు, ఐక్యఉపాధ్యాయ పత్రిక మాజీ ప్రధాన సంపాదకులు, అనువాదకులు, సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక సాహితీ అవార్డు ప్రధానోత్సవం మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం జరిగింది. సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా వారి కుటుంబసభ్యుల సహకారంతో యుటిఎఫ్, సాహితీ స్రవంతి, ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో సాహిత్య రంగంలో కృషి చేసిన వారికి ప్రతి సంవత్సరం ఈ అవార్డును బహుకరించడం జరుగుతోంది. కేశవరెడ్డి పేరుమీద ఏర్పాటు చేసిన ఈ అవార్డును ఈ ఏడాది మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యానికి అందించారు. ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, ప్రముఖ చరిత్ర కారుడు, ప్రొఫసర్ కొప్పర్తి వెంకటరమణ మూర్తి, కేశవరెడ్డి కుటుంబ సభ్యుల చేతులమీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కేశవరెడ్డి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, అనువాదకునిగా కేశవరెడ్డి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయనను స్మరించుకుంటూ ప్రతి ఏడాదీ సాహితీ అవార్డును ప్రధానం చేయడం గొప్పవిషయమని తెలిపారు. ముందుగా ఇటీవల ▶ 2లో

ఎన్నికల వేళ పరిశ్రమలు సాధ్యమా..?

- మూడు నెలల్లో ఎన్నికల వస్తుంటే.. ఇప్పుడు పరిశ్రమల కోసమంటూ పరిశీలన
- హడావుడిగా దొనకొండ, కనిగిరి వద్ద భూముల సందర్శన
- పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ పర్యటనపై విమర్శలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. అందుకు జిల్లా యంత్రాంగం కూడా ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పుడు ఏం చేసినా ఎన్నికల కోసం తప్ప ప్రజల కోసం కాదని చెప్పక తప్పదు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి సోమవారం హడావుడిగా దొనకొండ, కనిగిరి ప్రాంతాల్లో ప్రతిపాదనలో ఉన్న పరిశ్రమల కేంద్రాలకు సంబంధించిన భూములను పరిశీలించారు. దాదాపుగా ఐదేళ్లు మౌనం దాల్చారు. వాటి ఊసే లేదు. ఇప్పుడు ఈ భూములను పరిశీలించి పరిశ్రమలు పెడుతున్నట్లుగా అక్కడ జనాల్లో చర్చకు దారితీసేలా చేశారు.

దొనకొండలో పరిశ్రమల ఏర్పాటు కోసమంటూ భూములను మంగళవారం పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్

ఇప్పటివరకూ బటన్ నొక్కడం తప్ప ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో రాలేదు. ఉన్న గ్రానైట్ పరిశ్రమలూ సంక్షోభంలో పడ్డాయి. ఇలాంటి తరుణంలో ఎన్నికలకు ముందు రాష్ట్రప్రభుత్వం పరిశ్రమలు పెడుతుందంటే ఎవరైనా నమ్ముతారా? అంటే ఎవరూ నమ్మేలా లేరు. గత ఐదేళ్లు దొనకొండలోనూ, కనిగిరి వద్ద పరిశ్రమలపై ఎన్నో మాటలు చెప్పారు. అవిగో పరిశ్రమలూ.. ఇవిగో ఫ్యాక్టరీలు.. వచ్చేశాయ్ ఉద్యోగాలు.. అంటూ సాగిన ప్రచారాలకు నిరుద్యోగులు కూడా విసుగెత్తిపోయారు. ఇప్పుడు అక్కడ పరిశ్రమలు అంటే ఎవరూ పట్టించుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కనిగిరి వద్ద యుపిఎ హయాంలోనే నిమ్జ్‌ను ప్రతిపాదించారు. పీసీపల్లి, పామూరు, మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ పరిశ్రమలకు పెట్టాలని ప్రతిపాదించారు. అందుకోసం అన్ని రకాల ప్రతిపాదనలు, నివేదికలు సిద్ధమయ్యాయి. కొన్ని భూములను సేకరించినట్లుగా బోర్డులూ పెట్టారు. పీసీపల్లి మండలంలో పామూరు-కందుకూరు రోడ్డులో ఉన్న భూముల్లో ఈ బోర్డులు వెలిశాయి. ఏపిఐఐసీ అరకొరగా కొన్ని భూముల్లో రోడ్లు వేసింది. అయితే ఇక్కడ ఏ పరిశ్రమ కూడా రాలేదు. కేంద్రం పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఎటువంటి హామీ దీనిపై ఇవ్వలేదనే భావనతో వదిలేశారు. సిఎస్‌పురంలో సోలార్ పవర్‌ప్లాంట్‌ను పెడుతున్నట్లు ప్రకటించారు. అదీ అతీగతీ లేదు. ఈ ప్రాంతంలో నిరుద్యోగుల్లో ఇక్కడ ▶ 2లో

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో

రబీకి సాగునీరు అందించలేం..

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌కు సాగునీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నీటిపారుదల సలహా మండలి జిల్లాస్థాయి సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఆలస్యంగా సాగు చేసిన వరి పంటలను రైతులు కాపాడుకోవడానికి మాత్రమే పశ్చిమ కష్ణా డెల్టా పరిధిలోని భూములకు డిసెంబర్ 15వ తేదీ వరకు నీరు అందిస్తామని చెప్పారు. చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని కారంచేడు, చీరాల, చిన్నగంజాం, వేటపాలెం మండలాలకు మాత్రమే వారాబందీ విధానంలో సాగునీరు విడుదల చేస్తామన్నారు. గడ్డు పరిస్థితుల్లోనూ రైతులకు మేలు చేసేలా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఆహారధాన్యాలు ఉత్పత్తి చేస్తున్న రైతులను ఎవరూ విస్మరించరాదన్నారు. వారికి మేలు, సహాయం చేస్తే మనకు మనమే మేలు చేసుకున్నట్లు అవుతుందన్నారు. ఇదే క్రమంలో పంటలను కాపాడుకునే రైతుల కొరకు బాపట్ల శాసనసభ్యులు ప్రత్యేకంగా పెద్ద మోటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పంటల దిగుబడి సమయంలో సాగు నీరు రైతులకు అందించి ఎంతో మేలు చేశారని ప్రత్యేకంగా అభినందించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

వర్షా భావ పరిస్థితులలో రబీ సీజన్‌లో నీరిచ్చే పరిస్థితి లేదని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. తాత్కాలికంగా వరి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు. నాగార్జున సాగర్, పశ్చిమ కష్ణా డెల్టా పరిధిలోని ఆయకట్టు భూములలో ప్రత్యామ్నాయ పంటల కింద పొగాకు, మినుము, పెసలు పంటలు వేసుకోవాలన్నారు. బావులు, బోర్ల సౌకర్యం ఉంటే వాటి కింద మొక్కజొన్న, జొన్న పంటలు వేసుకోవచ్చన్నారు. బోర్లు, బావుల సౌకర్యం లేని భూములలో మినుము పెసర వేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

పశ్చిమ కృష్ణా డెల్టా 17 మండలాలలో 3,79,997 ఎకరాలు ఆయకట్టు భూములు సాగులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. నాగార్జునసాగర్ కెనాల్ కింద 11 మండలాలలో 1,69,246 ఎకరాలు సాగవుతున్నాయని వివరించారు. 40 మైనర్ ఇరిగేషన్ కింద 8,381.83 ఎకరాల భూమి సాగుతున్నాయని, 19 మండలాలలో 93 ఎత్తిపోతల పథకాల కింద 1,13,332 ఎకరాల భూమి ఉందన్నారు. 35 మేజర్ కాల్వలు, మరో 49 మైనర్ కాలువలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో జల వనరులు తగ్గాయన్నారు. తాగునీటి అవసరాల కోసం జనవరి, మార్చి నెలలో నీరు విడుదల అవుతాయని, వాటితో నూరు శాతం తాగునీటి చెరువులన్నిటిని అధికారులు నింపాలని కలెక్టర్ చెప్పారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జల వనరుల శాఖ, ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని ఆ దిశగా పనిచేయాలన్నారు. రానున్న వేసవిలోనే సాగనీటి కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టేలా ప్రతిపాదనలు డిసెంబర్ లోనే ప్రభుత్వానికి పంపాలన్నారు. సమగ్ర ప్రణాళికతో అధికారులు పని చేస్తే రైతుల సమస్యలు సులభంగా పరిష్కరించవచ్చన్నారు.

బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా అధికారులు ▶ 2లో

కన్నతల్లినే కడతేర్చాడు..

ఆస్తి వివాదమే కారణం ▶ 3లో

అధికారపార్టీ నేతల వేధింపులతో

ఐదుగురు వాలంటీర్లు

రాజీనామా ▶ 3లో

మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే ధ్యేయం

- రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్
- రంగన్నపాలెంలో విద్యుత్ ఉప కేంద్రానికి వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని రంగన్నపాలెం వద్ద రూ.145 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 220/132/33 సబ్‌స్టేషన్‌కు తాడేపల్లి నుండి సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఇక్కడ నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ ద్వారా 40 మెగా వాట్ల విద్యుత్‌ను సర్దుబాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే యర్రగొండపాలెంలోని 132/33 ఉపకేంద్రం ద్వారా వైపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని 15 సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, పొలాలకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. దీంతో ఓవర్ లోడు సమస్య తరచుగా ▶ 2లో

త్వరలో జిల్లాలో బాలోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజేతలైన వారికి అతిథుల చేతులుమీదుగా బహుమతి ప్రదానం చేశారు. బహుమతి ప్రదానోత్సవ సభకు జెవివి నాయకులు కె సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం చేతులుమీదుగా బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రకాశం జిల్లాలో కూడా దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం తరుపున బాలోత్సవాలు నిర్వహణకు ప్రారంభ సూచికగా చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. చిత్రలేఖన పోటీల కన్వీనర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మూడు విభాగాలలో ఏడువందల ఎనభై ఆరు మంది విద్యార్థులు చిత్రలేఖన పోటీలలో పాల్గొన్నారని, మొత్తం 22మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, డి వీరాంజనేయులు, ఎస్ రవి, అబ్దుల్ హై, వినోద్‌బాబు, ఓ వీరారెడ్డి, సృష్టి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు టి రవీంద్ర, పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు శేషయ్య, ప్రముఖ రచయిత్రి టి.అరుణ, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కె.లక్ష్మయ్య, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ఎవి పుల్లారావు, ప్రజాశక్తి బ్యూరో ఎస్‌వి బ్రహ్మం, కొమ్మారెడ్డి కేశవరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు. విఠపు బాలసుబ్రహ్మణ్యంను అవార్డుతో ఘనంగా సత్కరించారు. ముందుగా కొమ్మారెడ్డి కేశవరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడుతుందని చెప్పారు. ఈ కష్టాలను స్వయంగా చూసిన తాను రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకుని వెళ్ళగా 220/132/33 సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడమే కాకుండా రూ.145 కోట్లు మంజూరు చేశారని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ ఉప కేంద్రాన్ని గడువు లోగా పూర్తి చేసి.. నాణ్యమైన విద్యుత్‌ను ఈ ప్రాంత ప్రజలకు అందిస్తామన్నారు. రైతును రాజును చేయాలనేది ముఖ్యమంత్రి ఆశయమని చెప్పారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందుకే విద్యుత్ సరఫరా మెరుగుదలకు ప్రాధాన్యతను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నాణ్యమైన కరెంటు ఇవ్వడాన్ని గొప్ప అవకాశంగా తాము భావిస్తున్నామన్నారు. రైతులకు మేలు చేయడం కన్నా మించిన సంతప్తి మరొకటి లేదన్నారు. రైతులతో పాటు అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆకాంక్ష కాగా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా విద్యుత్ సంస్థలు, ఉద్యోగులు పని చేస్తున్నారని, దాని ఫలితంగానే ఇప్పుడు మనం అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యుత్ అందించే రాష్ట్రంగా ఏపీ ఉండనుందని అన్నారు.

విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉంటేనే పరిశ్రమలు తరలివస్తాయని, పారిశ్రామికాభివద్ధి జరుగుతుందన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు మంచినీరు ఇవ్వడం సాధ్యమవుతుందన్నారు. ఈ ఉప కేంద్రాన్ని సకాలంలో పూర్తి చేస్తామన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యుత్‌తోనే అభివృద్ధి, మెరుగైన జీవితం ఆధారపడి ఉందని, అందుకే ప్రస్తుత అవసరాలు తీరడంతో పాటు భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి పెంపు జరిగిందని, భవిష్యత్తులో కరెంట్ కోతలంటే ఏమిటో తెలియని రాష్ట్రంగా ఏపీ, జిల్లాగా ప్రకాశం మారబోతుందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ నాగేశ్వరరావు, ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, కందుల వెంకటయ్య, జడ్పిటిసిలు చేదూరి విజయభాస్కర్, వాగ్యానాయక్, వైసీపీ మండల కన్వీనర్లు కొప్పక్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ వైసిపి అధికారంలోకి రావాలి: ఉడుముల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలో పాతపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే మరియు జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనువాసులురెడ్డి, ఎంపిపి మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొన్నారు. ప్రజలకు మరింత మంచి చేయడానికి మరోసారి వైసిపి అధికారంలోకి రావాలన్నారు. అందుకే వై ఏపీ నీడ్ జగన్ అనే కార్యక్రమం ద్వారా మరింత చేరువ కానున్నది మన ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు వెంకటరెడ్డి, సర్పంచ్‌లు దొంతిరెడ్డి జయమ్మ, మెట్టు రవణమ్మ, గోపిదేశి ఓబులరెడ్డి, ఎంపిటిసి కరేటి నాగలక్ష్మి, నోడల్ అధికారి రావూరి జనార్ధన్, పంచాయతీ సెక్రటరీ, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సేకరణలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రామిరెడ్డి, కెవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల బోర్డును ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల

దర్శి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తాళ్లూరు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం తాళ్లూరు మండలం మల్కాపురం పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం సర్పంచ్ వలి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను నేరుగా ఇళ్లకే ఇస్తున్నట్లు చెప్పారు. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. ముందుగా వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తూము సుబ్బారెడ్డి, ఈవోఆర్డీ రాజు, మండల కోఆప్షన్ మెంబరు కరిముల్లా, మన్నేపల్లి పీఏసీ చైర్‌పర్సన్ కుమ్మిత జయరామిరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పవన్, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పొదిలి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంతి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఉప్పలపాడు మాజీ సర్పంచ్ ఉలవా గోపి అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ పరిధిలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సచివాలయం ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తరువాత పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను అందరికీ అందించే జగన్ అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గుంటూరు ఏసోబు, పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైసిపి నాయకులు

14వ వార్డులో పనులు పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

అవసరమైన చోట రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీలో అవసరమైన చోట రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. మంగళవారం స్థానిక 14వ వార్డులో రూ.15 లక్షల నిధులతో నిర్మిస్తున్న సైడు కాలువల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రవమాణాలతో రోడ్లు నిర్మించాలని కోరారు. నగర పంచాయతీలో వీలైనంత వరకు నిధులను బట్టి రోడ్లన్నీ నిర్మిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు రామగిరి, రంగ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రబీకి సాగునీరు అందించలేం..

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులు, ఎగువ ప్రాంతాలలో నీరు లేనందున రబీ సీజన్‌కు నీరు విడుదలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి వరి పంటలు వేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటిని వథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ మురళీకష్ణ, ఇంజనీరింగ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ పరిశ్రమలు సాధ్యమా.?

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలపై ఆశలు ఆవిరయ్యాయి. కనిగిరి ప్రాంతంలో నిమ్స్ మంజూరుకు అప్పటి కాంగ్రెసు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కీలకంగా పనిచేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను సంప్రదించి దీని కోసం చర్యలు చేపట్టారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. దొనకొండ విషయానికి వస్తే మంత్రిగా ఉన్నప్పుడు శిద్దా రాఘవ రావు దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పలు కంపెనీలు ఇక్కడకు తెప్పించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఇక్కడ కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఎటువంటి చర్యలూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదు. అసెంబ్లీలో సిఎంగా ఉన్న చంద్రబాబు ప్రకటన చేశారే తప్ప దీన్ని కార్యరూపం దాల్చేలా ప్రణాళికలు మాత్రం లేవు. ఇక్కడ కొంత భూమిని సేకరించి ఏపిఐఐసీ రోడ్లు వేసింది. ఇతర సౌకర్యాలు ఏమీ లేనందున ఎవరూ ఫ్యాక్టరీలు పెట్టడానికి ముందుకు రాలేదు. నీళ్లు, కరెంటు, స్కిల్డ్‌వర్కర్లు, రవాణా సౌకర్యాలు, ముడి పదార్థాలపై స్పష్టత లేదు. ఇక్కడ ఏదీ అందుబాటులో లేదు. ఏవో కొన్ని పరిశ్రమలు వస్తాయనే ప్రచారాలు సాగాయి. కొన్ని దేశాల ప్రతినిధులు వచ్చి భూములను చూశారు. అంతటితో సరిపెట్టారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ పరిశ్రమలు పెట్టేందుకు ఒక్క అడుగు కూడా వేయలేదు. ఎన్నికల్లో చంద్రబాబు హామీగానే దీన్ని చూశారు. పూర్తిగా వదిలేశారు. అక్కడ రైతుల్లోనూ, జనంలోనూ ఆశల్లేవు. పరిశ్రమలు వస్తాయని భూములు కొన్న రియల్టర్లు తర్వాత వాటిని అమ్మేసుకొని పోయారు. అయితే ఎన్నికల ముందు ఇప్పుడు పరిశ్రమల శాఖ కార్యదర్శి వచ్చి భూములను, మ్యాపులను చూశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఇవన్నీ రొటీన్‌గా అధికారులు చేసేవే.. వీటి వల్ల ప్రయోజనం ఉందా? అనేది ఆలోచించాలి. ఎన్నికల సమయంలో ఏదో చేస్తున్నామనే ప్రచారం ఏమైనా ఉపయోగపడుతుందా? అంటే ఏమీ లేదు. ఆఖరు నిమిషంలో పరిశ్రమల కోసం అంటూ అధికారులు చేసిన పర్యటనపై స్థానిక జనం నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాస్‌పోర్ట్ పోయినది

ప్రకాశం జిల్లా, బేస్తవారిపేట మండలం, బేస్తవారిపేట గ్రామానికి చెందిన చింత వినోద్ కుమార్ తండ్రి బాబు అను నేను, నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. 2023 నవంబర్ 20వ తేదీ బేస్తవారిపేట మండలంలోని మా స్వంత గ్రామమైన బేస్తవారిపేట నుండి పెద్దఓబినేనిపల్లి గ్రామానికి నేను ద్విచక్రవాహనం పై వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో పాస్ పోర్ట్ పోయినది. దారి పొడవునా ఎంత వెతికినను దొరకలేదు ఎవరికైనా నా యొక్క పాస్ పోర్ట్ దొరికినచో దిగువ తెలిపిన చిరునామాకు తెలియజేయగలరు

ఇట్లు
చింత వినోద్‌కుమార్, తండ్రి బాబు,
ఇంటి నెంబర్ **9-32A** ,బేస్తవారిపేట గ్రామం,
బేస్తవారిపేట మండలం,ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్ - **523334**
సెల్ నెంబర్: **8978553900**

Notice U/S 19 (2) of the provincial Insolvency Act

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No : 20/2022

Between
మందడపు రమేష్ ....పిటిషనర్
V/s
షేక్ బాబావలి మరియు ఇద్దరు.......రెస్పాండెంట్స్
Notes To:- R1)
షేక్ బాబావలి S/o మస్తాన్
R2) షేక్ షఫీయా D/o షేక్ బాబావలి,
W/o షేక్ బాజీ, ముస్లిం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం, ప్రస్తుతం బాపట్ల జిల్లా. ఇరువురిది ఒకే చిరునామా

పై నంబరు కేసులో పిటిషనర్ పిటిషను పరిహార నిమిత్తం అనగా R1 ను insolvent గా Declare చేయమని కోరుచూ మరియు R2 & R3 పేరు మీద R1 వ్రాసిన రిజిస్టర్ గిఫ్ట్ డిడ్ లను రద్దు పరచమని కోరుచూ పిటిషను దాఖలు చేసి యున్నాడు. సదరు పిటిషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేస్తున్నందున మీ నోటీసు నిమిత్తం తేది 15-12-2023 నకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజున మీరు ఉదయం 10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ లేదా వకీల్ ద్వారా కానీ హాజరు పడి ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల నీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

స్థలం:- అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
వాయిదా :- 15.12.2023

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి — ఇట్లు
తేది :28.11.23 — **యడవల్లి శ్రీనివాసరావు**
బీ.కాం,ఎల్.ఎల్.బి
పిటీషనర్ తరపు అడ్వకేట్
అద్దంకి
సెల్ నెం : **9441692970**

టెండర్ ప్రకటన

ప్రకాశం జిల్లా,మర్రిపూడి మండలం,కూచిపూడి గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం యొక్క ఈ క్రింద తెలిపిన పనికి గాను ఐదవ తరగతి రిజిస్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనికి గాను తేది: 29-11-2023 ఉదయం10.00 గంటల నుండి తేది:11-12-2023 సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండర్ షెడ్యూల్ తేది:12-12 -2023 ఉదయం10.00 గంటల నుండి తేది:13-12-2023 సాయంత్రం 5.00 గంటల వరకు ఇవ్వబడును. టెండర్ దరఖాస్తుతో పాటు టెండర్ ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ గాని, నగదు చెల్లించిన రసీదు గాని జతపరచవలెను.షీల్డు కవర్లు తేది:14-12-2023 ఉదయం 10.00 గంటలకు సదరు కార్యాలయం నందు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 4.00 గంటలకు శ్రీయుత జిల్లా దేవాదాయశాఖ అధికారి, దేవాదాయశాఖ, ప్రకాశం జిల్లా, ఒంగోలు వారి కార్యాలయం నందు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నం	పని పేరు	అంచనా విలువ	టెండర్ ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పని పూర్తి చేయు కాలము
1	దేవాలయము ముఖమండపంనకు రంగులు వేయుట	రూ.2,50,000/-	రూ.6,250/-	రూ.500/-	2 నెలలు

ఏ కారణము చేతనైనా లేదా కారణం తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారి గారికి అధికారము కలదు.

ఇట్లు, ఎం.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి.

కన్నతల్లినే కడతేర్చాడు..

- ఆస్తి వివాదమే కారణం
- చీరాల మండలం

పుల్లాయిపాలెంలో ఘటన

ప్రజాశక్తి - చీరాల

మద్యానికి బానిసైన కుమారుడు ఆస్తి విషయంలో గొడపడి కన్నతల్లినే విచక్షణా రహితంగా కత్తి పొడిచి కడతేర్చాడు. ఈ ఘటన చీరాల మండలం పుల్లాయిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మండలంలోని పుల్లాయిపాలెంలో నివాసముంటున్న నక్కల వీరయ్య, వెంకటరత్నం దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు చిన్న కుమారుడు గతంలో మతి చెందాడు. పెద్ద కుమారుడు శివయ్య వివాహం చేసుకొని అదే గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటరత్నం ఇటీవల బ్యాంకు నుంచి లోను తెచ్చుకొని ఇల్లు కట్టుకుంది. అందుకు ప్రతి నెలా బ్యాంకుకు కిస్తీలు కట్టాల్సి ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా బ్యాంకు కిస్తీలు కట్టడం వెంకటరత్నంకు కష్టతరంగా మారింది. దీంతో తమ కున్న 3 ఎకరాల పొలంలో అర ఎకరం అమ్మి ఇంటి బాకీ తీర్చేందుకు ఆమె సిద్ధమయ్యింది. విషయం గురించి ఆమె కుమారుడు శివయ్య తెలియటంతో పొలం అమ్మకుండా అడ్డుపడ్డాడు. ఈ క్రమంలో ఆస్తి విషయమై తల్లి కొడుకుల మధ్య స్వల్ప విభేదాలు ఏర్పడ్డాయి. కిస్తీలు చెల్లించాలని బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరగటంతో పొలం అమ్మాలని వెంకటరత్నం నిర్ణయించుకుంది. పొలం అమ్మటం ఇష్టంలేని శివయ్య మద్యం తాగి వచ్చి మంగళవారం తల్లితో ఘర్షణ పడ్డాడు. చివరకూ మాట మాట పెరగడంతో చివరకూ శివయ్య విచక్షణ కోల్పోయి కత్తితో తన మెడపై దాడి చేశాడు. దీంతో ఆమె కుప్ప కూలిపోయి అక్కడికక్కడే మతి చెందింది. ఈ విషయం గురించి సమాచారం అందుకున్న సిఐ సోమశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మదేహాన్ని పోస్టుమార్టం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి చేతిలో హత్యకు గురైన వెంకటర్నం

2,3 తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో వారంతపు సమీక్షలో భాగంగా ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీలలో నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బిఎల్‌ఒలతో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గం లోని 259 పోలింగ్ స్టేషన్‌లలో అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఫారం 6లో కొత్త ఓట్లు చేర్చుకోవటానికి, ఫారం 7లో డబుల్ ఓట్లు తొలగింపుకు, ఫారం 8లో ఓట్లు ఒక చోటు నుంచి మరొక చోటుకు మార్చుకోవటానికి, ఫారం 6బితో ఆధార్ అనుసంధానం చేసుకోవటానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. అభ్యంతరాలుంటే తెలియజే యాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు తహశీల్దార్ పి. మురళి, ఒంగోలు ఎంపిడిఒ పి. అజిత, కొత్తపట్నం ఎంపిడిఒ పి.సుజాత, డిటీ అర్జున్ రెడ్డి, ఎసిపి వెంకటేశ్వర్లు, ఒంగోలు డిటీ రఫీ , రాజకీయ పార్టీల ప్రతినిధులు, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి స్వరూప్, బిజెపి ప్రతినిధి బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె.రసూల్.పాల్గొన్నారు.

నేడు దీక్షిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో దీక్షిత్ భారత సంకల్పయాత్ర బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి. సుజాత తెలియజేశారు. దీక్షిత్ భారత సంకల్పయాత్రపై అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర పథకాల గురించి అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ ,ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్, దీన దయాల్ అంత్యోదయ యోజన పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. . ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, ఎంపిడిఒ పి. సుజాత, అల్లూరు ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ శ్రీ లక్ష్మీబాయి , టిబి సూపర్ వైజర్ చంద్రమౌళి,అల్లూరు జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి రామారావు, హిమబిందు, విఆర్‌ఒ ప్రవీణ్ పాల్గొన్నారు.

గర్భిణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని..

రిమ్స్ వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గర్భిణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని కోరుతూ బంధువులు రిమ్స్ వైద్యశాల వద్ద మంగళవారంధర్నా నిర్వహించారు. గర్భిణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్య సిబ్బంది లంచాలు అడిగారని వారు ఆరోపించారు. మృతురాలి బంధువులు రోడ్డుపై బైటాయించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒంగోలు వన్‌టౌన్, టుటౌన్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని బంధువులు, వైద్యులతో సంప్రదింపులు జరిపారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించటంతో వారు ఆందోళన విరమించారు. పొదిలి మండలం తుమ్మకుంట గ్రామానికి చెందిన కుంచం ఏసమ్మ(36) గర్భిణి, ఆమె భర్త నాగేశ్వరరావు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తుంటారు. వారికి ఆరుగురు సంతానం. ప్రస్తుతం ఏసమ్మ నిండు గర్భిణి. ఏసమ్మ ఈగలపాడు గ్రామంలోని తన తల్లి ఇంటికి వెళ్ళింది. ఆదివారం ఆయాసం ఎక్కువగా వస్తుండటంతో పొదిలిలో పిహెచ్‌సిలో చూపించారు. వైద్యులు ఒంగోలు తీసుకెళ్ళాలని సూచించడంతో రిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఏసమ్మ మరణించటంతో మార్చురీకి తరలించారు.. రిమ్స్‌కు చేరుకున్న మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఏసమ్మ మృతి చెందితే పోస్టు మార్టం చేయకుండా వైద్యులు తాత్సారం చేశారని, పోస్టుమార్టం చేయటానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అనంతరం జరిగిన విషయాన్ని రిమ్స్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంఒకు వివరించారు. పోలీసుల శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనను విరమించారు.

రోడ్డుపై బైటాయించిన మృతురాలి బంధువులు

వైద్యసిబ్బంది డబ్బులు అడగలేదు..

డాక్టర్ తిరుమల రావు, ఆర్‌ఎంఒ

ఈనెల 26న రాత్రి 8 గంటల సమయంలో ఏసమ్మకు గాలి తీసుకోవటం(బ్రీతింగ్ ప్రాబ్లం) ఇబ్బందిగా ఉండటంతో 108లో ఒంగోలు రిమ్స్‌కు తీసుకొచ్చారు. ఆసుపత్రికి వచ్చిన 5-10 నిమిషాలలో ఏసమ్మ మృతి చెందింది. ఆసమయంలో విధులలో ఉన్న వైద్యులు మెడికల్ లీగల్ కేసు(ఎంఎల్‌సి) నమోదు చేశారు. సోమవారం పోలీసులు రాకపోవటంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం ఆలస్యం కావటంతో బంధువులు ఆందోళన చేశారు. పోలీసుల శవపంచనామా అనంతరం పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు. మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నట్లు వైద్యులు, సిబ్బంది ఎవరూ డబ్బులు అడగలేదని స్పష్టం చేశారు.

ఎస్ఐ రజియాకు ఛార్జ్ మెమో

ప్రజాశక్తి -శింగరాయకొండ

అవినీతి, అక్రమాలపై కథనాలు రాసిన ఓ విలేకరిపై సివిల్ తగాదాలను అడ్డం పెట్టుకొని తప్పుడు కేసులు నమోదు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడిన గతంలో జరుగుమల్లి ఎస్‌ఐగా పనిచేసిన ఎస్‌కె. రజియా సుల్తాన్‌కు ఛార్జ్ మెమో జారీ అయ్యింది.. ఎస్‌ఐ రజియా సుల్తాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ విలేకరి ఎస్‌ఐపై ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్‌కు గతంలో ఫిర్యాదు చేశాడు.దీంతో హెచ్‌ఆర్‌సినెం. 1693/2022 కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ కేసు నెం 47/ ఎ4, ఎం.పి.ఆర్ /2023తో జూన్ 25 2023న ఛార్జ్ మెమో జారీ చేశారు. ఆ విషయం గురించి ఫిర్యాదుదారుడి మానవ హక్కుల కమిషన్ మంగళవారం సమచారం అందించింది. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని అధికారులపై సంబంధిత అథారిటీస్‌కు ఫిర్యాదు చేసి నిరుత్సాహ పడకుండా, పోరాటాలు చేస్తే, చట్టపరంగా న్యాయం పొందవచ్చనేదానికి ఈ ఘటన మంచి ఉదాహరణగా నిలిచింది.

బైకును ఢీకొన్న లారీ

ఆర్‌టిసి ముఠా కూలీ మృతి

మార్కాపురం రూరల్ : బైకును లారీ ఢీకొన్న ఘటనలో ఆర్‌టిసి ముఠా కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మార్కాపురానికి కూతవేటు దూరంలో ఎన్న పారిశ్రామికవాడ సమీపంలోని వై. జంక్షన్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... తర్లుపాడు మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన పూజ రమణ(40) ఆర్‌టిసిలో ముఠా కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే సోమవారం తుమ్మలచెరవు నుంచి మార్కాపురం వచ్చి పనులు నిర్వహించారు. మంగళవారం ఉదయం బైకుపై స్వగ్రామానికి బయలు దేరాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి నెల్లూరు దోర్నాల వైపు ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రమణ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మార్కాపురం పట్టణ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

భార్య మృతి..భర్తకు గాయాలు

అద్దంకి : నక్కను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తాకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన అద్దంకి పట్టణ సమీపంలోని నల్లవాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... బల్లికురవ మండలం ఎస్‌ఎల్.గుడిపాడు గ్రామానికి చెందిన వెంకాయమ్మ (30), ఆమె భర్త పండ్ల వ్యాపారం నిమిత్తం మేదరమెట్ల సమీపంలోనున్న సంతకు వద్దకు ఆటోలో వెళ్తున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆటోకు నక్క అడ్డుగా వచ్చింది. నక్కను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో వెంకాయమ్మ అక్కడిక్కడే మృతిచెందింది. ఆమె భర్తకు స్వల్ప గాయాల య్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం వైద్యశాల తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

మార్కాపురం రూరల్ : పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని పెద్దనాగులపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్ అనే వ్యక్తి షేక్ అల్లావుద్దీన్ అనే వ్యక్తికి కొడుకు వరస అవుతాడు. అల్లావుద్దీన్ గతంలో ఫక్రుద్దీన్ వద్ద ఒకటిన్నర ఎకరా భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పొలం గట్ల వద్ద ఇద్దరు మధ్య వివాదం ఏర్పడింది. గ్రామంలోని పెద్దలు సర్ది ఇద్దరికి సర్దిచెప్పారు. అనంతరం అల్లావుద్దీన్ ఈద్గా వద్ద వేరే వారి పొలంను కౌలుకు తీసుకుని సాగు చేసు కుంటున్నాడు. ఈ క్రమంలో ఫక్రుద్దీన్ పాత గొడవలను మనసులో పెట్టుకొని పొలంలోని నీటి మోటారును బోరు లోపలికి ఎందుకు పడేశావంటూ అల్లావుద్దీన్ పై గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా కత్తితో అల్లావుద్దీన్‌పై దాడి చేశాడు. స్థానికులు అల్లావుద్దీన్‌ను ఆటోలో మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

అధికార పార్టీ నేతల వేధింపులతో

ఐదుగురు వాలంటీర్లు రాజీనామా

గిద్దలూరు రూరల్ : గిద్దలూరు మండలం సంజీవపేట గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు వాలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఎంపిడిఒ హేమలత దేవికి మంగళవారం తమ రాజీనామా పత్రాలు అందజేశారు. అధికార పార్టీ నాయకుల వేధింపులు, దౌర్జన్యాలు భరించలేక మనోవేదనకు గురై వాలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలిసింది. ఇదే సచివాలయం పరిధిలో మరో 10 మంది వాలంటీర్లు కూడా రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

ఉద్యమాలే విద్యారంగానికి రక్షణ

మాట్లాడుతున్న రఘురామయ్య

ప్రజాశక్తి - పంగులూరు

ప్రభుత్వం ఒక పథకం ప్రకారం జీవో నెంబర్ 117తీసుకొచ్చి ఉపాధ్యాయులను కుదించి, పాఠశాలలను మూసివేయాలనే ప్రయత్నంలో ఉందని యుటిఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఇదే విధానం కొనసాగితే విద్యావ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ జీఓకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులంతా ఉద్యమించాలని కోరారు. ఉద్యమాల ద్వారానే ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టి, పాఠశాలలను నిలుపుకుంటామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు యు చెంచయ్య, పి హరిబాబు అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన యుటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఈ పోరాటానికి ఉపాధ్యాయ వర్గాలతో పాటు, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని, పెండింగులో ఉన్న పిఆర్సి, డిఏ బకాయిలను మంజూరు చేయాలని, అమ్మ ఒడి ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలని, తెలుగు మీడియంను రద్దు చేయడం విరమించుకోవాలని, సమాంతర మీడియంలను ఉంచాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు పిఎస్, హెచ్‌ఎం పోస్టును కేటాయించాలని, హెల్త్ కార్డు ద్వారా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సమావేశంలో తీర్మానించార యుటిఎఫ్ పంగులూరు మండల నూ తన కమిటీని సభ్యులు ఏక గ్రీవంగా ఎ న్నుకున్నారు. అధ్యక్ష, కార్య దర్శులుగా టివీ నరసింహారావు, బి సుబ్బారావు, సహాధ్యక్షులుగా కె సోమశేఖర్, ఐవీ రమణ, కోశాధికారిగా ఎస్‌కె ఫిరోజ్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు పరిశీలకులుగా పూనాటి హరిబాబు, యు చెంచయ్యలు వ్యవహరించారు.

అధ్యక్షులు నరసింహారావు

ప్రధానకార్యదర్శి సుబ్బారావు

జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నిజాంపట్నం

జన విజ్ఞాన వేదిక నూతన కమిటీ ఎన్నికను స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చారు. గౌరవ అధ్యక్షులు గా నిజాంపట్నం హైస్కూల్ హెచ్‌ఎం శివన్నారాయణ, అధ్యక్షులుగా జికె పేట ఎంపిపి స్కూల్ ఎస్‌ఎ దబ్బకూటి హరిబాబు, సహాధ్యక్షులుగా పి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా నిజాంపట్నం జడ్పీహెచ్‌ఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఎండి హుస్సేన్, సభ్యులుగా యు కుమార్, ఎస్ ధర్వేష్, చంద్రయ్య, అబుల్ మాలిక్, సత్యనారాయణ, ఎం విజయలక్ష్మి ఎన్నికయ్యారు. యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ మాట్లాడుతూ మూఢాచా రాలను పారదోలటం, విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి జన విజ్ఞాన వేదిక ఎంతో కృషి చేస్తుందని అన్నారు. నూతన అధ్యక్షులు దబ్బకూటి హరిబాబు మాట్లా డుతూ జెవివి సహకారంతో విద్యార్థులకు ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్ట నున్నట్లు తెలిపారు. విద్యార్థులను సైన్స్‌పట్ల ఆకర్షితులను చేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య, యుటిఎఫ్ నిజాంపట్నం మండలం అధ్యక్షులు కె రాజేష్, ప్రధాన కార్యదర్శి గణేష్‌రావు పాల్గొన్నారు.

అధ్యక్షులు డి హరిబాబు

కార్యదర్శి బి ప్రసాద్

ఇసుక మాఫియా ఆగడాలకు అంతులేదు

మీడియా సమావేశంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలకు అంతులేదని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. ఆయన తన నివాస గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసైన్డ్ భూములు లీజులు తీసుకొని ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గంజాయి వాడకం పెరిగిపోయి యువతలో అనేక పెడ ధోరణులకు దారితీస్తుందని అన్నారు. వీటిని పోలీసులు కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ఎన్నికల హామీ ప్రకారం ప్రతి పార్లమెంట్ స్థానాన్ని జిల్లా చేయడం, మెడికల్ కళాశాల ఏర్పాటు పాలసీ మేటర్ అన్నారు. బాపట్ల జిల్లాగా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి సచివాలయం, ఆర్‌బికె ఏర్పాటు చేయడం స్వాగతించ దగ్గ విషయమని తెలిపారు. సమావేశంలో గాదె మధుసూదనరెడ్డి, అల్లం గోపీకృష్ణ, గోవతోటి విజయ్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు జిట్టా శ్రీనివాసరావు, గిరిజా రాణి, పాటిబండ్ల శేఖర్, చింతా కిషోర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

3న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- రేపల్లె

డిసెంబర్ 3న స్థానిక ఎంసిఎ హాల్‌లో జరిగే స్వర్ణోత్సవ వేడుకలు, ద్వితీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు కోరారు. ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ, జిల్లా కౌన్సిల్‌కు సంబంధించిన కర పత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబరు 3న స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ర్యాలీ, సభ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం నుండి ప్రతి నిధుల సభ జరుగుతుందని అన్నారు. సభకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, కొమ్మెజు నివాసరావు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు, ఎంఎల్‌ఎ అనగాని సత్య ప్రసాద్, ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, యుటిఎఫ్ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంవిబి సుబ్రమణ్యం, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె సాయిప్రసాద్, జి సుబ్రహ్మణ్యం, కెపి నాయడు, రవీంద్ర, రేపల్లే ప్రాంతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎం సభ్యుడు వెంకట రమణ మృతి

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని ప్రాసంగలపాడు గ్రామం లో కామ్రేడ్ ఉబ్బా వెంకట రమణ(51) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన గత 24ఏళ్ల నుండి సిపిఎం సభ్యునిగా పనిచేస్తున్నారు. అనేక కళారూపాలలో పాల్గొన్నారు. సిపిఎంలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ పిలుపు మేరకు అన్నీ కార్యక్రమాల్లో పనిచేసేవాడని సిపిఎం మండల కార్యదర్శి ఎం ఆంజనేయులు అన్నారు. అతని మృతికి సిపిఎం మండల కమిటీ, ప్రాసంగులపాడు గ్రామ శాఖ సంతాపాన్ని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మద్దిపాడు మండల సిపిఎం బాధ్యులు ఉబ్బ వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, బొంతు దశరథ, మూర్తి, కంచర్ల సురేష్, వై రవీంద్రబాబు, నందికోలు సుబ్బారావు, సావ కోటేశ్వరరావు ఉన్నారు.

కామ్రేడ్ వెంకటరమణ

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రామారావు

11,12 తేదీల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు

బాపట్ల : జిల్లాలో డిసెంబరు 11, 12తేదీల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలని డిఇఒ పివిజె రామారావు విద్యాశాఖ అధికారులకు మంగళవారం సూచించారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణపై స్థానిక ఎస్‌ఎంజి హై స్కూల్లో హెచ్‌ఎంలు, ఎంఇఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు డిసెంబర్ 11, 12తేదీల్లో ప్రభుత్వ పాఠశాలల, మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించాలని తెలిపారు. ఏడు అంశాలపై పోటీలుంటాయని అన్నారు. అన్ని రకాల పోటీల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఆసక్తిగా పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలని చెప్పారు. 25 మండలాల్లో ప్రథమ స్థానం పొందిన ప్రాజెక్టులను ఎంపికచేసి జిల్లాస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటిలో ప్రతిభ కనబరచిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో పోటీపడతాయని అన్నారు. కౌశల్ 2023 ప్రతిభా పోటీలు 13, 14తేదీల్లో పాఠశాల స్థాయిలో జరపాలని చెప్పారు. హెచ్‌ఎంలు, కౌశల్ కో ఆర్డినేటర్లు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 3న జరిగే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు పగడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతీ మండలంలో క్షేత్ర స్థాయిలో నమోదుపై శ్రద్ధ వహించాలని అన్నారు. సమావేశంలో చీరాల డీవైఈఒ ఆర్ శ్రీనివాసులు, డీఎస్ఒ మహమ్మద్ సాదిక్, ఎంఇఒలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపిపి

కోడూరుకు ప్రశంస

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా కార్పెంటర్ సేవలు అందజేసిన కోడూరు వెంకటేశ్వరరావుకు అఖిల భారత విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంజూరైన ప్రశంసా పత్రాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. వెంకటేశ్వరరావు సేవా దృక్పథంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారని పలువురు అన్నారు. దీనిలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం కింద అనేక మందిని ప్రోత్సహించి గుర్తింపు కార్డుల కొరకు రిజిస్ట్రేషన్ కూడా చేయించటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత కుమారి, జడ్పిటిసి ఉదయభాస్కరి, మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్యశాస్త్రి, వెల్లటూరు పంచాయతీ కార్యదర్శి రామ్ కుమార్, ఏఒ శైలజ, వైసిపి నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ నేతాజీ

రుణ సౌకర్యంపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఒ కె నేతాజీ అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పేదలందరికీ ఇల్లు పథకం పురోగతిపై చర్చించారు. మండలంలో 1074మంజూరయ్యాయని అన్నారు. ఈ ఇల్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపారు. పేదల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునే వారికి ఇంకా అదనపు రుణాన్ని అందజేసేందుకు ముందుకొచ్చిందని అన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చి పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకారం ఇస్తుందని అన్నారు. డ్వాక్రా ద్వారా రుణాలను మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి సచివాలయ పరిధిలో ఇల్లు నిర్మించుకుంటున్న అర్హులను గుర్తించి వారు అదనపు రుణ సహాయాన్ని పొందేలా సెక్రటరీలు కృషి చేయాలని అన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం సుబ్బారావు, ఇఒఆర్డీ బాపూజీ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని మందగుంట, బోడవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు మౌలిక వసతుల ఎర్పాటుకు నీళ్ళ టాంక్, కరెంట్ మోటార్, టాయిలెట్స్‌కు అవసరమైన పైప్ లైన్ ఎర్పాటు గురించి రోటరీ సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు ప్రతి పాదనతో సపోర్ట్ ఆర్థిక సహాయంతో రూ.50వేలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా స్కూల్ హెడ్ మాస్టర్ కెవిహెచ్ ప్రసాద్‌కు మంగళవారం అందచేశారు. ఈనిధులతో పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సపోర్ట్ అధ్యక్షుడు పోలిశెట్టి చంద్రశేఖరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, ఆకుల వెంకటేశ్వరరావు, అద్యపకురాలు జి పద్మలత, అడ్డగడ శివరామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్

విద్యుత్ శాఖ ఎస్ఈ కెవిజి సత్యనారాయణ

మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కెవిజి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెం విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ ప్రాంతంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో విద్యుత్ లోడు అధికంగా ఉండడంతో షిఫ్టుల పద్ధతిలో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 1.90 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నట్లు చెప్పారు. 14 వేల బ్యాంకు అకౌంట్ల నెంబర్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందులో మూడు వేల మంది ఇష్టపూరిత దరఖాస్తులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా కనిగిరి, కొత్తపట్నం ప్రాంతాల్లో వెయ్యి వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించినట్లు చెప్పారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2014 నుంచి ఇప్పటి దాకా ఉన్న సర్వీసులలో ట్రూ ఆఫ్ చార్జీల కింద బిల్లులో అదనపు చార్జీలు వస్తున్న మాట వాస్తవమేనన్నారు. అయితే అదనపు ఛార్జీలను 36 కంతులుగా విభజిస్తున్నామన్నారు. ఇప్పటికి 18 కంతులు పూర్తైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో 506 జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పూర్తైనట్లు చెప్పారు. 24 వేల పక్కా గృహాలకు గాను 16 వేల పక్కా గృహాలకు విద్యుత్ మీటర్లు అమర్చినట్లు చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 40 వేల వ్యవసాయ కనెక్షన్లు, 54 వేల గృహాల సర్వీసులు ఉన్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడైనా దొంగతనానికి గురైతే ఎఫ్ఐఆర్ అందజేసిన రెండు, మూడు రోజుల్లోనే దాని స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి గురైన పొలంలో పంట సాగులో ఉంటే ప్రత్యేక అనుమతి తీసుకొని వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో రెంటపల్లి, గారపెంట, ఐనముక్కల, ఓడ్డుపాలెం, తమ్మడపల్లి, సంగంతాండా, గంగపాలెం, మురారిపల్లి, దేవరాజుగట్టులలో సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. యర్రగొండపాలెం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో రూ.4.96 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు వివరించారు. సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ బిల్లుల్లో వ్యత్యాసాలు ఉన్న మూడు వేల సర్వీసులను ఎనిమిది నెలల క్రితం గుర్తించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం 502 మీటర్లలో మాత్రమే రీడింగ్‌లో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. వాటిని కూడా డిసెంబర్ మొదటి వారం నాటికి సరి చేస్తామన్నారు. వ్యత్యాసాలకు బాధ్యులైన విద్యుత్ సిబ్బందిని గుర్తించి షోకాజ్ నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఇళ్లలోపల ఉన్న మీటర్లను ఇంటి బయట బిగించుకోవాలని తెలిపారు. ఎవరికైనా బిల్లు రాకుంటే నేరుగా కార్యాలయానికి వచ్చి విషయం తెలియజేయాలన్నారు. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. విద్యుత్ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో విద్యుత్ ఈఈ పివి నాగేశ్వరరావు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు విద్యుత్ ఏఈలు తలపాటి అల్లూరయ్య, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నాడు సమగ్ర శిక్ష అభియాన్ ఏఎమ్ఓ రమేష్ సమీక్ష నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు, మండలంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో కాంప్లెక్స్ సమావేశాల గురించి, ఎస్ఎ 1 పరీక్షలు గురించి, టిఎఆర్ఎల్ గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు, సిఆర్‌పి కూతల వంశీ లలిత, కుమారి, ప్రమీల, హెచ్ఎంలు ఎం.మహాలక్ష్మి, పద్మజ, డిఎస్‌కె.ప్రసాద్, డివిఎస్ ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు సరికాదు

- ఆధారాలతో 'సిట్'కు ఫిర్యాదు చేయాలి
- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో ఎవరు ఎలాంటి వారో ప్రజలకు తెలుసునని, తమపై లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేయడం సరి కాదని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురంలోని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. తాము భూములు కొల్లగొట్టినట్లు ఆరోపణలు చేయడం కాదని, ఆధారాలతో సిట్ దర్యాప్తు బృందానికి ఫిర్యాదు చేయాలని టిడిపి నేతలకు సూచించారు. ఇడుపూరు ఇలాఖాలో ముదిరెడ్డి భాస్కరరెడ్డి వారి కుటుంబీకులకు 20 ఎకరాల భూమి ఉందన్నారు. అందులో హైవేలో కూడా కొంత భూమి పోవడంతో దానికి నష్టపరిహారం భాస్కరరెడ్డి ఒక్కరే కాదు.. అందులో భాగస్తులంతా తీసుకోవడం జరిగిందన్నారు. ఆ భూమి తాము కొట్టేసినట్లు చెప్పడం, దానిపై తమపై ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. ఆ భూమి విషయం లో ఆ గ్రామ మాజీ సర్పంచి, టిడిపి నాయకుడు జవ్వాజి రామాంజులరెడ్డిని అడిగి తెలుసుకుంటే బాగుంటుందని టిడిపి నేతలకు సూచించారు. ఆ 20 ఎకరాల్లో 10 ఎకరాలు పట్టా కాగా... మరో 10 ఎకరాలు చెరువుకు సంబంధించినదని చెప్పారు. మార్కాపురం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని భూమిపై నాగరాజు అనే వ్యక్తి కోర్టులో కేసు వేసి విత్‌డ్రా చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆ భూమిని కొనుగోలు చేసింది కూడా ఎస్.పరమేశ్వరరెడ్డి, ఆడిటర్ సత్యనారాయణలేనని గుర్తు చేశారు. రామడుగు రమేష్‌కు చెందిన భూమిలో ఇద్దరి మధ్య పేచీ ఉందని, ఆ ఇద్దరు తమ పార్టీకి చెందిన వారేనన్నారు. దానిపై ఇద్దరికీ న్యాయం జరిగేలా సర్ది చెబుతున్నామన్నారు. పోరెడ్డి నాగిరెడ్డి ఆశిస్తున్న భూమి ఇతరులదని చెప్పారు. వేల్పుల కుమారికి చెందినదన్నారు. ఆమెకు హక్కులు ఉన్నందున ఆమెకు న్యాయం చేయాలనుకోవడం తప్పా.? అని ప్రశ్నించారు. ఎస్‌వికెపి కళాశాల ఎదుట స్థలాన్ని గొంట్లా చక్రపాణి వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అందులో టిడిపి నేతలు కూడా భాగస్వాములుగా ఉన్నారని గుర్తు చేశారు.

భూదందాలపై

ఎస్‌పికి ఫిర్యాదు చేసింది వైసిపి వాళ్లే..

టిడిపి నేత కందుల రామిరెడ్డి

మాట్లాడుతున్న కందుల రామిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి నేతల భూదందాపై జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసిన వారంతా వైసిపికి చెందిన వారేనని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు రామిరెడ్డి చెప్పారు. మంగళవారం సాయంత్రం మార్కాపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నేతలపై ఫిర్యాదు చేసిన ముదిరెడ్డి భాస్కరరెడ్డి, పోరెడ్డి నాగిరెడ్డి, మరికొందరు ఆ పార్టీకి చెందిన వారేనని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత మార్కాపురంలో జరిగిన భూ దందాలపై విచారణ చేపడతామని, బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. భూ దందాలకు పాల్పడిన వారు ఎక్కడ దాక్కున్నా వెదికి పట్టుకొస్తామన్నారు. ప్రస్తుతం ఎవరి స్థలం కబ్జాకు గురవుతోందోననే భయంతో కుంట స్థలం ఉన్న వారు సైతం కంచెలు, గోడలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతోందన్నారు. దేవండ్ల సుబ్బారావు శ్రీనివాస థియేటర్ సమీపంలో అమ్మిన భూమిపై విచారణ చేపడతామన్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి గుడి అభివృద్ధికి తాము కృషి చేసినట్లు చెప్పారు. టిడిపి కాలంలో 80 శాతం క్రీడా వికాస కేంద్రం పూర్తయిందని, దాన్ని వైసిపి ప్రభుత్వ కాలంలో ప్రారంభించి సంబరపడ్డారన్నారు. మార్కెట్ యార్డులో గోడౌన్‌లు తమ కాలంలో నిర్మించామన్నారు. కోల్డ్ స్టోరేజి తాము మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే వైసిపి ప్రభుత్వం దాన్ని ఆపేసిందన్నారు. వెలిగొండను ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పిన జగన్ నేడు పట్టించుకోలేదన్నారు. నిర్వాసితులను గాలికి వదిలేశారన్నారు. టిడిపి అధికారంలోకి రాబోతోందని, మెడికల్ కాలేజి, వెలిగొండ ప్రాజెక్టు తామే ప్రారంభిస్తామని చెప్పారు. వీటితో పాటు మార్కాపురం జిల్లా సాధిస్తామన్నారు. వైసిపి చేతగానితనంతో జిల్లాను కోల్పోయామన్నారు. టిడిపి కాలంలో ఏమీ అభివృద్ధి జరగలేదని వైసిపి నేతలు అనడం సరికాదన్నారు. సమావేశంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, టిడిపి మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యంత బాధ్యతతో పనిచేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అధికారులు అత్యంత బాధ్యతతో పనిచేసి ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను చట్టబద్ధంగా పరిష్కరిస్తే ఫిర్యాదులే ఉండవని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల బిఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బిఎల్వోలు, బిఎల్ఏలు, సమన్వయ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా రూపొందించడం చాలా ముఖ్యమన్నారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. బిఎల్వోలు ఓట్ల విచారణలో అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత అందులో ఏమైనా తప్పులుంటే ఆయా బిఎల్వోలు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి జి సువర్ణమ్మ, ఐదు మండలాల తహశీల్దార్లు కె రవీంద్రారెడ్డి, కె దాసు, వి కిరణ్, ఏ వేణుగోపాల్, ఎంవి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ముగిసిన కబడ్డీ శిక్షణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రకాశం జిల్లా మహిళా కబడ్డీ జట్టు శిక్షణ మంగళవారంతో ముగిసిందని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రకాశం మహిళ కబడ్డీ జట్టుకు ఈ నెల 24 నుంచి 28వ తేది వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కబడ్డీ కోచ్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి హజరత్తయ్య పేర్కొన్నారు. క్రీడాకారిణులకు గొల్లపోతు గోవర్ధన్ బ్రదర్స్ క్రీడా దుస్తులను, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.హరిబాబు, కె.కష్ణారెడ్డి, రవాణా ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదును, బి.ప్రభాకర్‌రెడ్డి, బి.అశోక్‌కుమార్‌రెడ్డి, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. కబడ్డీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో దాతలందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీను, అంకయ్య, ఎస్ఎంసి చైర్మన్ ఈతముక్కల మాధవరావు పాల్గొన్నారు.

'అభివృద్ధి-లబ్ధి' పట్టికను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైసిపి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని పాత శింగరాయకొండ పంచాయతీలో మంగళవారం 'జగన్ అన్న ప్రభుత్వమే మళ్లీ కావాలి..' అంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వం అందించిన అభివద్ధి - లబ్ధి పట్టికను సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి ఝాన్సీ, సచివాలయం కన్వీనర్ కొల్లూరి సాయికోటి యాదవ్, గ్రామ సీనియర్ నాయకులు గాలి బుజ్జి, చిమట సుధాకర్, దాసరి శేషయ్య, బొడ్డు నరసింహ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంఇఒ శివాజీ

'నాడు-నేడు' పనులు పూర్తి చేయాలి

ఎంఇఒ శివాజీ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ-2 శివాజీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాటిమీదపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆయన నాడు-నేడు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులకు సంబంధించి నిధులు త్వరగా ఖర్చు పెట్టి.. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు 2 పాఠశాలలకు స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయన్నారు. వాటిని తరగతి గదులలో ఏర్పాటు చేసుకునే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నెట్ సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్‌బుక్స్, సిలబస్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె శిలార్, ఉపాధ్యాయులు ఎం.విజయలక్ష్మి, వాకా కవిత పాల్గొన్నారు. స్థానిక ఎన్ఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 ఎస్.వెంకటేశ్వర్లు పరిశీలించారు. విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ1 పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం యాకోబు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు పద్మావతి

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

పాఠశాలలకు తరచుగా హాజరుకాని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి హాజరయ్యే విధంగా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిఆర్పిలు, ఎంఎస్‌కెలను ఆదేశించారు. మండలంలోని ఏల్చూరు, పుట్టావారిపాలెం గ్రామాలలోని అంగన్ వాడి సెంటర్స్, పుట్టావారిపాలెం ఎంపీయుపి పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇచ్చి తమ పిల్లలు పాఠశాలలకు హాజరు అయ్యే విధంగా చూడాలని ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావుకు సూచించారు. పాఠశాలలోని విద్యార్థులను ప్రశ్నించి, విద్యా ప్రమాణాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగూర్ వలి, ఎంఈఒ వి కోటేశ్వరరావు, హెచ్‌ఎం శేఖర్ బాబు పాల్గొన్నారు.

దుకాణ దారులకు నోటీసులు ఇస్తున్న కార్యదర్శి బాజి

ఆక్రమణ దారులకు నోటీసులు

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో స్థలం ఆక్రమించి దుకాణం కట్టిన ఆక్రమణ దారులకు పంచాయితీ కార్యదర్శి బాజి మంగళవారం నోటీసులు అందచేశారు. గత ఏడాది డిసెంబర్ 24న కూల్చివేతల అనంతరం దాదాపుగా మిగిలి ఉన్న భవన యజమానులు, దుకాణదారులకు 10సార్లకుపైగా నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మహేష్ ఉన్నారు.

వైద్య సిబ్బందిని విచారిస్తున్న డిఐఒ వెంకటేశ్వరరావు

ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బండ్ల ఆదెమ్మ ఆరోగ్య కేంద్రం నందు డిఐఓ టి వెంకటేశ్వరరావు మంగళవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక వైద్యశాల నుండి రెండు పిర్యాదులు అందినట్లు తెలిపారు. ఓఎస్ రూపేష్‌పై డాక్టర్స్ పట్ల, సిబ్బంది పట్ల గౌరవంగా ప్రవర్తించడం లేదని, వన్ ఆఫ్ ద స్టాఫ్‌గా డాక్టర్ సిబ్బంది పట్ల సక్రమంగా లేడని, సిబ్బంది అందరూ బాధపడుతున్నారనే రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. డిఎం అండ్ హెచ్‌ఓ ఆదేశాల మేరకు విచారణకు విచ్చేసినట్లు చెప్పారు. సిబ్బంది దగ్గర రాతపూర్వకంగా వివరాలను పూర్తిస్థాయిలో విచారించి డిఎం అండ్ హెచ్‌ఓకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, జిల్లా స్టోర్స్ ఫార్మర్సిస్టు ఉన్నారు.

'నేడు జగనన్నకు చెబుతాం'

ప్రజాశక్తి - చిన్నగంజాం

జగనన్నకు చేబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నేడు మండలంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఒ కె స్వరూపరాణి మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు చిన్నగంజాంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా తోపాటు అధికారులందరూ హాజరవుతారని తెలిపారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జ్యోతి చంద్రమౌళి

ప్రజాశక్తి - అద్దంకి

మహత్మ జ్యోతిరావ్ పూలే 133వ వర్ధంతి సందర్భంగా స్థానిక బంగళారోడ్డులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ దేశంలో మహాత్మ బిరుదు పొందిన ఒకేఒక్కరు పూలే అని అన్నారు. భారతదేశ మొట్టమొదటి సామజిక విప్లవకారుడని అన్నారు. మహిళల విద్యకోసం, సమానత్వం కోసం, అంటరానితన నిర్ములన కోసం, మత మౌడ్యాన్ని పారద్రోలి చైతన్యం కలిగించి, దేశంలో స్త్రీలకొరకు పాఠశాలలు స్థాపించిన మొట్ట మొదటి వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, ఏఎస్ఓ రావూరి అమర్నాథ్, ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అంకం నాగరాజు, ఏజీపి యర్రమోతు రమేష్ బాబు, మేదరమెట్ల మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, జ్యోతి డేవిడ్, సయ్యద్ ఖాసీం, హుసేన్, మంచు హనుమంతరావు, జనరజుపల్లి ప్రభాకారరావు, కెవి కంప్యూటర్స్ విజయ్ బాబు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపిపి లలితకుమారి

భట్టిప్రోలు : సంఘసంస్కర్త, కుల నిర్మూలన పోరాట యోధులు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జెడ్పిటిసి ఉదయ భాస్కరి, ఎంపీడీఒ గుమ్మా చంద్రశేఖర్ మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్యశాస్త్రి, తహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఇఓపిఆర్డి ఊహారాణి, ఏఒ శిరీష, వైసిపి నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జైభీం రమేష్

రేపల్లె : దేశంలో నెలకొన్న సామాజిక అసమానతలు, దురాగతాలపై అలుపెరగని పోరాటాలు చేసిన యోధుడు మహాత్మ జ్యోతిబాపూలే అని జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ అన్నారు. జ్యోతిబా పూలే 133వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. మహారాష్ట్ర సతారా జిల్లా మాలి కులంలో జన్మించిన మహాత్మ జ్యోతిబా పూలే చిన్ననాటి నుండి సమాజంలో శూద్ర కులాలు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షత, అణచివేతలను గ్రహించి విద్య ద్వారానే సమాజ చైతన్యం సాధ్యమవుతుందని తన భార్య సావిత్రిభాయి పూలే ద్వారా ఈ దేశంలోనే మొట్టమొదటి మహిళా పాఠశాల ప్రారంభించారని అననారు. జ్యోతిబా పూలే ఆలోచన విధానాన్ని అనుసరించి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పూలేను తన గురువుగా స్వయం ప్రకటన చేసుకున్నారని గుర్తు చేశారు. దేశంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రుగ్మతలు రూపు మాపిన నాడే పూలేకు నిజమైన నివాళులని అన్నారు. పట్టణంలో పూలే విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ అధికారులు సత్వరమే కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభీమ్ పార్టీ మండల కన్వీనర్ కర్రా బాబురావు, నేరుసు వెంకటరావు నాయుడు, రెవరెండ్ జి మాథ్యూ, జూలకంటి ఏసుబాబు, షేక్ కరీముల్లా, బోడి రాంబాబు, కారుమూరు మధుబాబు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసింహవర్మ

బాపట్ల రూరల్ : మహాత్మ జ్యోతిరావు పూలే తొలి సంస్కరణ ఉధ్యమకారులని రావూరి నరసింహ వర్మ కొనియాడారు. సాహితీ భారతీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పూలే 133వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సమాజంలో దురాచారాలను రూపుమాపటానికి పూలే అహర్నిశలు కృషి చేశారని అన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు, హిందీ పడిట్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, ఆదం షఫీ, ఎన్ కృష్ణ, ఎం జాకబ్, శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్ర మూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీరాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

పర్చూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో చీరాల మాజీ శాసనసభ్యులు, పర్చూరు వైసిపి ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, జెసిఎస్ కన్వీనర్ ముప్పాళ్ళ రాఘవయ్య, ఆకుల హేమంత్, జంగా అనీల్, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి ప్రసాదు, లంకా శివ, కొమ్మాలపాటి శివయ్య, సిరిగిరి బ్రహ్మయ్య, మల్లంపాటి చెంచు బాబు, పర్చూరు మాజీ వైస్ ప్రెసిడెంట్ గాదె సురేష్, గోగుల పూర్ణయ్య, కంచనపల్లి రమేష్, కొక్కిరాల చిన్ని, కటారి ప్రసన్న, గొల్లపూడి సర్పంచ్ రామకృష్ణ, కొల్లా రామకృష్ణ, కొల్లా శ్రీహరి పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రతి కుటుంబానికీ సంక్షేమం

కరపత్రాలు అందజేస్తున్న ఎంపిపి లలితకుమారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు గ్రామంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయభాస్కర్లు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. పథకాలు ముందుకు కొనసాగాలంటే మరో మారు జగనే ముఖ్య మంత్రి కావాలని అన్నారు. ఇప్పటివరకు గ్రామానికి అందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరిం చారు. అనంతరం గ్రామంలో వైసిపి జెండా ఆవిష్కరిం చారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె : మండలంలోని కారుమురు గ్రామాల్లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే వినూత్న కార్యక్రమాన్ని వైసిపి నియోజకవర్గం సర్పంచుల ఫోరం అధ్యక్షులు మండలి అంజయ్య, కారుమూరు వైసిపి ఇన్‌ఛార్జి గుడి శ్రీహరి ప్రారంభించారు. మౌలిక సదుపాయాల కల్పన దిశగా కారుమూరు గ్రామాభివృద్ధిలో భాగంగా సుమారు రూ.30.67కోట్లను గ్రామ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాల ద్వారా అంద జేశారని అన్నారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరిస్తూ రూపొందించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం అని వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య అన్నారు. మళ్లీ జగనన్ననే సీఎంగా చేసుకోవాలని చెప్పే అద్భుతమైన కార్యక్రమఅ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడి రమాదేవి, రామాయణం రత్తయ్య, కారుమూరు గ్రామ వైసిపి ఇంచార్జ్ గుడి శ్రీహరి, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఫరీద్, ఎంపీడీఒ శివ పార్వతి, ఇఒ పిఆర్డి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైసిపి నేత అంజయ్య

చీరాల : రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నా రాబోయే ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డిని, వెంకటేష్ బాబును గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. ఎంఎల్‌ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జీ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని రామనగర్ సచివాలయం పరిధిలో 1వ వార్డ్ ఇంచార్జ్ మల్లి రామకృష్ణ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కోండ్రు బాబ్జీ, డిఈ ఏసయ్య, పోలీస్ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ మల్లి వైష్ణవి, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్ మొగిలి దీపిక, వైసిపి జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, ఎనల్లబోతుల రాజ్ కుమార్, కోలా శివకృష్ణ, మల్లీ హరీష్, కౌన్సిలర్ మల్లెల లలితరాజశేఖర్, కో ఆప్షన్ షేక్ కబీర్, షేక్ సుభాని, కళ్యాణం విజయప్రకాష్, షేక్ రియాజ్, దుడ్డు సైమన్, మామిడాల సుబ్బారావు, తేళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చీరాల వైసిపి నేతలు

కారంచేడు : మండలంలోని కుంకలమర్రు సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ మళ్ళీ ఎందుకు కావాలి అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచి ఈదర సౌందర్య అధ్యక్షత వహించారు. సభలో ఎంపీడీఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కుంకలమర్రు పంచాయతీలోని సచివాలయం రెండు పరిధిలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో రూ.14కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగాయని చెప్పారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బోర్డును ఆవిష్కరించారు. మరింత అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనే రావాలని అన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి ఆర్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి కె అంజయ్య పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచి ఈదర సౌందర్య

పావురాలు ఎగురేస్తున్న విసి శారద

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగడానికి క్రీడలు అత్యుత్తమ మార్గాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆర్ శారదా జయలక్ష్మీదేవి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో ఈనెల 30వరకు మూడు రోజులు పాటు జరిగే ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అంతర అనుబంధ కళాశాలల ప్రథమ దశ ఆటల పోటీలను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు, మానసిక వికాసానికి యువతకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అన్నారు. విశ్వ విద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల్లో క్రీడలకు సంబంధించిన వసతుల మెరుగు పరుస్తామని తెలిపారు. ఆర్‌డిఒ గంధం రవీందర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే క్రీడల పోటీలకు 18కళాశాలలకు చెందిన 400మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం లాక్ డౌన్ యేడాది మినహాయించి వరుసగా ఆరు సార్లు క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ పి సాంబశివరావు, రిజిస్ట్రార్ జి రామారావు, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డి స్మిత్, ఎన్‌టిఆర్ కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ వై రాధ, విశ్వ విద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ ఆర్ రవికాంత్‌రెడ్డి, టివి శ్రీధర్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న మార్కెటింగ్ మేనేజర్ రమేష్‌బాబు

కోల్డ్ స్టోరేజీలకు మరమ్మతులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కమిటీ గోదాముల్లో ఆరు నెలల పాటు నామమాత్రపు రుసుం చెల్లింపులతో నిల్వ ఉంచుకొనే అవకాశం కల్పిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖాధికారి కె రమేష్ బాబు కోరారు. మండలంలోని పుట్టా వారిపాలెం గ్రామంలోని సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం వివిధ రికార్డులను పరిశీలించారు. అడ్డరోడ్ జంక్షన్‌లోని చెక్ పోస్ట్ నందు సెస్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలో 28చెక్ పోస్టులు ఉన్నాయని అన్నారు. వాటి ద్వారా ఏటా రూ. 7కోట్ల ఆదాయం వస్తుందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న గోదాములకు మరమ్మత్తులు జరిపేందుకు రూ. 5కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సెక్రటరీ సి చార్లెస్, గాడ్ కె ప్రభాకర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలకు కొండయ్య స్వాగతం

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర వ్యాప్తంగా టిడిపికి మంచి రోజులు వచ్చాయని టిడిపి ఇంచార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని పిట్టువారిపాలెం, వాడరేవు గ్రామాలకు చెందిన సుమారు 70కుంటుబాల వైసీపీ కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారికి టిడిపి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. పిట్టువారి పాలెంకు చెందిన నక్కల శ్రీనివాసరావు, వాడరేవుకు చెందిన ధోకి కనకరాజు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.

జగన్ ముద్దు .. ఆమంచి వద్దు

◆ ఆమంచి కృష్ణమోహన్ పద్ధతి మార్చుకో ◆ చిన్నగంజాం ఎంపిపి కోమట్ల అంకమ్మ రెడ్డి

ప్రజాశక్తి - చిన్నగంజాం

పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న చీరాల మాజీ ఎంఎల్‌ఎ ఆమంచి కృష్ణమోహన్ తన పద్ధతి మార్చుకోవాలంటూ ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి బహిరంగంగా హెచ్చరించారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో జగనన్న ముద్దు, ఆమంచి వద్దు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ బ్రహ్మారెడ్డి ఇంటి నుండి చిన్నగంజా మార్కెట్ సెంటర్, కొత్తపాలెం రైల్వే గేట్ సెంటర్ గుండా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంకమ్మరెడ్డి మాట్లాడుతూ ఇన్‌ఛార్జిగా వచ్చిన ఆమంచి కృష్ణమోహన్ ఆ విషయాన్ని మరిచిపోయి బాలినేని శ్రీనివాసరెడ్డిని, తనను, బ్రహ్మారెడ్డిని దూషించే పనే పెట్టుకున్నారని అన్నారు. 2014లో టిడిపిని ఎదుర్కొని చిన్నగంజాం మండలాన్ని వైసిపి తరపున నికరంగా నిలబడి గెలిపించామని అన్నారు. అలాంటి తమను విస్మరించి టిడిపి కోవర్టులను 50మందిని వెంటనే వేసుకొని తూతు మంత్ర కార్యక్రమాలు నిర్వహించి పబ్బం కడుపుకుంటున్నారని ఆమంచిపై విమర్శించారు. పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గెలుపు, ఓటములను నిర్ణయించేది చిన్నగంజాం మండలమేనని తెలిపారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని పెద్దలను కలుపుకొని పోవాలని ఆమంచికి హితవు పలికారు. 151 సీట్లతో గెలిచిన జగన్మోహన్‌రెడ్డి ప్రభంజనంలో కూడా చీరాల వంటి చిన్న నియోజకవర్గంలో 17వేల ఓట్లతో ఓడిపోయిన కృష్ణ మోహన్ స్థాయి అర్థం చేసుకోవాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. వైసిపిపై అభిమానంతో వచ్చే ప్రజలు తమ వేదిక ముందు ఉన్నారని, అవసరాల కోసం, ఇబ్బంది పెడతారనే భయంతో ఉండేవాళ్లే ఆమంచి వెంట ఉన్నారని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను పార్టీ అధిష్టానం గమనించాలని కోరారు. పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఆసోది భాగ్యలక్ష్మి, కొత్తపాలెం సర్పంచి బ్రహ్మారెడ్డి, పెద్దపల్లిపాలెం సర్పంచి, మోటుపల్లి సర్పంచి వడ్లమూడి సాంబశివరావు, ఎంపీటీసీ తిరుపతిరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కోమట్ల అంకమ్మరెడ్డి

ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జగన్ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆర్భాటంగా సంస్కరణలు మొదలు పెట్టింది. ఇంటి వద్దకే రేషన్ ఇస్తామని వాహనాలను ప్రవేశపెట్టింది. కానీ నేడు ఆ వ్యవస్థ అస్తవ్యస్తమైందని టిడిపి మైనార్టీ సెల్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు సిరాజుద్దీన్ మంగళవారం ఆరోపించారు. ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు చేసిన ప్రజా కంపెనీ వ్యవస్థకు అవసరమైన వాహనాలు నిరుయోగం అయ్యాయని అన్నారు. ఈ వాహనాల వలన ఎలాంటి ప్రయోజనం లేకపోగా ఉన్న సరుకులు కూడా ప్రభుత్వం తగ్గించి వేసిందని ఆగ్రహ వ్యక్తం చేశారు. మొన్న కంది పప్పు నేడు పామాయిల్ సరఫరా నిలిపివేసి లబ్ధిదారులను ఆందోళనకు గురి చేసిందని అన్నారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే అందిస్తున్నారని అన్నారు. దానికి ఇంత ఖర్చు చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వ పాలనలో ప్రజా పంపిణీతో పాటు అదనంగా పండుగ సమయంలో ఆయా రకాల తోపాలు అందించే వారిని అన్నారు. నేడు తోపాలు లేకపోగా నెలవారీ అందించే సరుకులు కూడా వైసిపి ప్రభుత్వం కోత విధించిందని అన్నారు. దీనివలన పేద ప్రజలకు ప్రతినెల రూ.వెయ్యి అదనపు ఖర్చు భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద ఒక రూపాయికి అందించాల్సిన బియ్యంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందించిన బియ్యాన్ని కూడా నెలకు ఒకసారి మాత్రమే అందించి వైసిపి ప్రభుత్వం చేతులు దులుపుకుంటొందని ఆరోపించారు. రేషన్ షాపు ద్వారా అందించాల్సిన నిత్యవసర సరుకులు క్రమ క్రమంగా రద్దు చేయడంతో పేదలు బయట అధిక ధరలకు కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఒక డీలర్‌కు 550తెల్ల రేషన్ కార్డులు ఉంటే దానిలో 23శాతం కందిపప్పు, 55నుండి 60శాతం పంచదార, 50శాతం గోధుమపిండి మాత్రమే అందజేసి చేతులు దులుపుకుంటుందని అన్నారు. మిగిలిన వారికి ఏ విధంగా అందుతాయని ప్రశ్నించారు. ఈ మాత్రం దానికి ఎండియు పథకం కింద రూ.వేలకోట్లు ఖర్చుపెట్టడం దేనికని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేద ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని కోరారు.

వీధి చివరలో వాహనం ద్వారా సరుకుల పంపిణీ

ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వద్దు

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని, వివక్షత చూపించకూడదని స్థానిక ప్రభుత్వం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కె రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. హెల్ప్‌టిఐ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సులో ఎజిపి వై రమేష్ బాబు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యతప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం అందించడంలో అవగాహన కలిగించాలని అన్నారు. హెల్ప్ టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు సకాలంలో మందులు వాడుకునే విధంగా, కండోమ్ వినియోగంపై ప్రచారం చేయాలని అన్నారు. యువత చిన్న వయసులోనే ప్రేమపేరుతో అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికీ హెచ్ఐవి, ఎయిడ్స్ కేసులు నమోదులో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికంగా కేసు నమోదవుతున్నాయని అన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమని అన్నారు. వ్యాధి ప్రజల్లో ప్రబలకుండా ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పిడి కె డేవిడ్ రాజు, హెల్ప్ టిఐ ఔట్రిచ్ వర్కర్స్ వి కరుణ, టి శ్రావణి, పిఈ మల్లేశ్వరి, పార్వతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎజిపి వై రమేష్‌బాబు

ఏడుకొండలుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆనందబాబు

సీనియర్ అసిస్టెంట్ గోపాలం మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు మండలంలోని చావలి గ్రామానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ గోపాలం ఏడుకొండలు గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఈయన కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమన మృతి సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, టీడీపీ పోలీస్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు చావలి గ్రామం వెళ్లి ఏడుకొండలు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వేమూరు, కొల్లూరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు అశోక్‌వర్ధన్

ఓటు హక్కే మన భవిష్యత్తు

ప్రజాశక్తి - వేటపాలెం

ఓటు హక్కు ద్వారా మన భవిష్యత్తు మనమే నిర్ణయించుకోవచ్చని తహశీల్దారు యు అశోకవర్ధన్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటరు నమోదుపై మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా చట్ట సభలకు జరిగే ఎన్నికలలో ఓటు వేయటం ద్వారానే దేశంతో పాటు రాష్ట్రం కూడా ప్రగతి పథంలోకి దూసుకు పోగలదని అన్నారు. 18ఏళ్ళ నిండిన ప్రతి విద్యార్థి ఓటరు గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలని అన్నారు. అది తమ భాధ్యతగా గుర్తుంచుకోవాలని సూచించారు. స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిపేషన్) సౌజన్యంతో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలక పాత్రని అన్నారు. అలాంటి విద్యార్థి ఓటు హక్కు ద్వారా నిజాయితీ గల నాయకుని ఎన్నుకుంటే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమమలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డి జ్యోతి స్వరూప్, వివిధ విభాగాల హెచ్ఒడిలు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టర్‌కు జరిమానా

ప్రజాశక్తి- కారంచేడు

రైల్వే స్టేషన్‌లోని టాయిలెట్స్‌కు, స్నానానికి వెళ్లినందుకు రూ.30 రుసుం వసూలు చేసినందుకుగాను ఆ రైల్వే కాంట్రాక్టర్‌కు చిత్తూరు జిల్లా రైల్వే అధికారులు రూ..1540 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన కట్టమూడి ధనుంజయ్ అనే యువకుడు ఈనెల 26న తిరుపతి వెళ్లడానికి చిత్తూరు రైల్వే స్టేషన్లో దిగి అక్కడ ఉన్న టాయిలెట్లు ఉపయోగించుకునేందుకు వెళ్లగా ఆ టాయిలెట్ల నిర్వాహకుడు స్నానానికి రూ.20, బాత్రూమ్స్ ఉపయోగించినందుకు రూ.10 వసూలు చేశాడు. అధిక మొత్తం లో వసూళ్లు చేయడంపై విసుగు చెందిన ధనుంజయ్ అక్కడు న్న రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరిం చిన అధికారులు మరుగుదొడ్లకు రుసు వసూళ్లపై విచారించారు. విచారణలో అధిక మొత్తంలో వసూళ్లఉ చేసిన ఆ టాయిలెట్లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు రూ. 1540 అపరాధ రుసుం విధించినట్లుగా రైల్వే అధికారులు మెసేజ్ పంపించినట్లుగా ధనుంజయ ప్రజాశక్తికి తెలిపారు.

మాతృమరణాలు తగ్గించేందుకు చర్యలు

అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో మాతృమరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మాత మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతమరణాలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మాతమరణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ ,ప్రవేట్ హాస్పిటల్స్‌ను తనిఖీలు చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మాత మరణాలు జరిగిన వైద్యశాలల్లోని వైద్యులను సమావేశపరిచి ఇందుకు గల కారణాలను గుర్తించాలన్నారు. మాతమరణాలు సంభవించకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కోఆర్డినేటర్ శశికుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, డాక్టర్ సునీత, డాక్టర్ రామకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పూలే సేవలు స్ఫూర్తిదాయకం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మహాత్మా జ్యోతిరావ్ పూలే 133వ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బీసీల అభ్యున్నతికై కషి చేసి ఒక గొప్ప సామాజిక సేవకునిగా, సంఘ సంస్కర్తగా అనేక విప్లవాత్మకమైన మార్పులను ఆనాడే తీసుకువచ్చిన మహనీయుడు అన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించి, ఎంతో పోరాడిన జ్యోతిరావు పూలే, వారి సతీమణి సావిత్రిబాయి పూలే ఆదర్శవంతంగా నిలిచారన్నారు. అనేక విద్యా సంస్థలను ప్రారంభించి చదువుతోనే ఏదైనా సాధించవచ్చు అని ఆనాడే విద్య యొక్క ప్రాధాన్యతను తెలియజేశారన్నారు. నాడే వారు బీసీ లంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నిరూపించారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తిని వారి ఆదర్శాలను తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బీసీలను అభివద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రత్యేక స్థానాలను, హోదాలను, అవకాశాలను కల్పించారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కషి చేసి ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తి, ఆదర్శాలను కొనసాగిస్తామని వారి మార్గంలో ఈ ప్రభుత్వం పయనిస్తుందని పేర్కొన్నారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, పుల్లలచెరువు జడ్పిటిసి వాగ్యానాయక్, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్రపోలు జయరావు, జడ్పి కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాబీర్ బాషా, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఐవి సుబ్బారావు, వెంకటయ్య గౌడ్, బీసి నాయకులు పోసాని శ్రీరాములు, శివ నాగేశ్వరచారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

పుల్లలచెరువులో..

మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి వేడుకలు పుల్లలచెరువు మండల పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఎంపిపి కందుల వెంకటయ్య, ఎంపిడివో మరియ దాసులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో అసమానతలపై, అంటరానితనంపై, కుల వివక్షకు వ్యతిరేకంగా మహిళా సాధికారత కోసం పని చేశారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు అందరం పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, హౌసింగ్ ఎఈ జాన్ సుందర్, వెలుగు ఎపిఎం వెంకటయ్య, ఉపాధి ఈసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు కృషి చేయాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమ సమాజ స్థాపనకు కషి చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఎస్పీ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమసమాజ స్థాపనకు విశేష కషి చేశారన్నారు. పూలే ప్రజలలో అనాదికాలంగా పాతుకుపోయిన వివక్షను నిర్మూలించడం కోసం తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలలో ఆత్మస్థైర్యం నింపి వారి సాధికారత కోసం కషి చేసిన మహనీయుడన్నారు. పూలే విద్య వివక్ష, పేదరికం, ఆర్థిక అసమానత్వం నిర్మూలించడానికి, కుల, మత రహిత సమాజ నిర్మాణానికి ఎనలేని కషి చేశారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, హెూమ్‌గార్డ్స్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్ పాల్గొన్నారు.

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

చీరాల: బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని సిపిఎం నాయకులు ఎన్.బాబూరావు, పి.కొండయ్య అన్నారు. మంగళవారం పూలే 133 వర్ధంతి సందర్భంగా స్థానిక గడియారస్తంభం సెంటర్లో ఉన్న పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సిహెచ్ మస్తాన్‌రావు, కె.వీ.శేషుబాబు, ఎనుముల యానాదిరావు, వీరాస్వామి అంజమ్మ పేరాల జనార్ధన్, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు లింగం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్యం' అందేదెప్పుడో.?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఈ చిత్రంలో కన్పిస్తున్న చిన్నారి పేరు అఖిల. ఈమె తండ్రి ఐదు సంవత్సరాల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. తల్లి నాగులు కూడా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దే ఉంటుంది. వాత్సల్య పథకం కింద దరఖాస్తు చేసి అయిదు నెలలు దాటినా ఇంత వరకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ఇబ్బందుల మధ్య అఖిల పట్టణంలోని హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది.

ఈ పథకం కింద లబ్ధిదారులకు ఇస్తున్న నిధులు కేంద్రానివైనా కొన్నిచోట్ల క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తమ లబ్ధి కోసం స్థానిక నేతల ద్వారా ఈ పథకానికి దరఖాస్తులు చేయించినట్లు కేంద్రం అనుమానిస్తోంది. అందుకే వేలాదిగా దరఖాస్తులు వచ్చాయని, వీటన్నింటినీ వచ్చిన వాటిని వచ్చినట్లుగా ఆమోదిస్తే పథకం పక్కతోవ పడుతుందని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే దరఖాస్తుల పరిశీలన, పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

నెలలు దాటినా ముందుకు సాగలే..

మిషన్ వాత్సల్యకు యర్రగొండపాలెం అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో కలిపి వెయ్యి మంది దాకా దరఖాస్తు చేశారు. ఈ పథకం కేంద్రానిదే అయినా లబ్దిదారుల గుర్తింపు తదితర అంశాల్ని రాష్ట్రం కొలిక్కి తెచ్చి నివేదిక పంపించాలి. దరఖాస్తులను పంపించాక కేంద్రం నిబంధనలు మారుస్తుండటతో అధికారులు అయోమయానికి లోనవుతున్నామంటున్నారు. కొన్నింటికి సరైన పత్రాలు కూడా జతపర్చకపోవడంతో వాటిని తిరిగి పంపించాలని నిర్ణయించారు. ఈ పథకంలో అనాధలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. యర్రగొండపాలెం అంగన్‌వాడీ ప్రాజెక్టు నుంచి వెయ్యికి పైగా దరఖాస్తులు రాగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు కేవలం 800 మందిని మాత్రమే అర్హులని తేల్చారు. ఇప్పటికే అమ్మఒడితో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందుతున్న వారు

అర్హులకు అందని లబ్ధి

ఈ పథకానికి అనర్హులుగా పరిగణించాలని పై నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.

ఎదురు చూపులు..

వాత్సల్య పథకం ప్రయోజనం ఎప్పుడు కలుగుతుందా అని అర్హులు ఎదురుచూస్తున్నారు. అభాగ్యులు, అనాథలు, యాసిడ్ బాధితులు, ఆసరా కోల్పోయిన 18 ఏళ్లలోపు బాలబాలికలకు అండగా ఉండేందుకు కేంద్రం మిషన్ వాత్సల్య పేరిట పథకాన్ని తెచ్చింది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఏప్రిల్‌లో ప్రక్రియ ప్రారంభమై జులై 30 వరకు సాగింది. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా దరఖాస్తులను స్వీకరిం చింది. నెలలు గడుస్తున్నా జిల్లా స్థాయిలో ఇంకా వాటి పరిశీలనతోనే సమయం గడిచిపోతోంది తప్ప కొలిక్కి రాకపోవడంతో అర్హులకు ఎదురుచూపులే మిగిలాయి.

ఎవరు అర్హులంటే..

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, తల్లినో, తండ్రినో కోల్పోయిన పిల్లలు, ప్రకతి వైపరీత్యాల బాధిత పిల్లలు, ఆక్రమ రవాణా, యాసిడ్ దాడుల బాధితులు, విడాకులు పొందిన దంపతుల సంతానం, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే తల్లితండ్రుల పిల్లలు.

లబ్ధి ఎలా..

ఈ పథకం కింద అర్హత సాధించిన వారికి నెలకు రూ.4 వేల చొప్పున అందుతుంది. 18 ఏళ్ల వరకు నెలనెలా ఈ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమవుతుంది.

క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఎంపిక

ఎం పద్మావతి, సీడీపీవో, యర్రగొండపాలెం

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేశాం. అర్హులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశారు. తాము జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాము. నిధులు అందించిన వెంటనే నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం.